క్లుప్తంగా

గూడూరు కమిషనర్‌గా రమేష్‌బాబు



కోడుమూరు రూరల్: గూడూరు నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న నాగరాజు కర్నూలు మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్‌గా బదిలీపై వెళ్లడంతో, కర్నూలు మున్సిపల్ కార్యాలయంలో పీఆర్వోగా పని చేస్తున్న రమేష్‌బాబును గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా ఉన్నతాధికారులు నియమించారు. ఈ మేరకు రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించి నగర పంచాయతీ పరిధిలోని సమస్యలపై సిబ్బందితో చర్చించారు.

గడ్డివామి దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని నిడ్జూరు గ్రామంలో గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామస్తుడు కురువ గోవిందరాజులు ఉదయమే కుటుంబ సభ్యులతోపాటు పొలానికి వెళ్లగా ఆయన ఇంటి సమీపాన ఉన్న గడ్డివాము అగ్నికి ఆహుతైంది. దాదాపు 5 ఎకరాల వరి గడ్డి పూర్తిగా కాలి బూడిదైంది. గ్రామస్తుల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా వీలుకాలేదు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో రూ.లక్ష విలువైన వరిగడ్డి పూర్తిగా దగ్ధమైందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

రెండు లారీలు ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో మలుపు వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. వివరాలు.. శుక్రవారం సాయంత్రం మలుపు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. దెబ్బతిన్న ఓ లారీ ఇళ్ల వైపు దూసుకెళ్లి గోడను తగిలి ఆగిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోని విచారణ చేస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

15 నుంచి దరఖాస్తుల పరిశీలన

ఓర్వకల్లు: బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగే దరఖాస్తుల పరిశీలన కార్యక్రమానికి సంబంధిత అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సిందిగా కోరారు.

అలరించిన నృత్య పోటీలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన చౌడేశ్వరీ దేవి తిరునాల పురస్కరించుకుని శుక్రవారం రాత్రి గ్రామీణ క్రీడల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంతమార్కెట్ మైదానంలో నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్ పోటీలు ప్రజలను విశేషంగా అలరించాయి. పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్స్‌తో ఆకట్టుకున్నారు. పోటీలను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి

కల్లూరు: గ్రామ సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌చలరెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం సల్కాపురం గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సల్కాపురం, ఎ.గోకులపాడు గ్రామాల్లో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకాలను పరిశీలించారు. వేతనదారులతో దినసరి వేతనం ఎంత వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం వస్తుందన్నారు. ఎంత మంది కూలీలు పనులకు హాజరయ్యారని మస్టర్లను పరిశీలించారు. ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాటి పాణియాలే నేటి పాణ్యం

- ఈ నెల 26 నుంచి పాణికేశ్వరుడి ఉత్సవాలు
- రాతి బండపై లిఖించిన స్వామి చరిత్ర
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు
- పనులను ప్రారంభించిన సర్పంచ్, అధికారులు

పాణ్యం: ఈ నెల 26వ తేదీ నుంచి పాణికేశ్వరుడి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్ మేకల పల్లవి ఆధ్వర్యంలో శక్రవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. గ్రామం నుంచి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉండే కంపచెట్లను తొలగించారు. అలాగే భక్తులు ఇబ్బంది లేకుండా ఆలయానికి చేరుకునేందుకు రోడ్డుపై గుంతలను పూడ్చే పనులు ప్రారంభించారు. సర్పంచ్‌తో పాటు దేవదాయశాఖ అధికారులు తిరుమలయ్య, సిబ్బంది పాల్గొన్నారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. చివరిరోజు గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. పాణికేశ్వర స్వామి తిరునాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

విశిష్టతలు

విష్ణువర్ధన్ మహారాజు నిర్మించిన ఈ ఆలయం నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. గర్భగుడి నిర్మాణానికి ఉపయోగించిన పెద్ద బండరాళ్లను చూస్తే వాటిని చెక్కిన శిల్పుల కళానైపుణ్యం ఉట్టిపడుతుంది. అంతేగాక గర్భగుడిపై ఉన్న భారీ రాయిపై కమలం పువ్వు ఆకారంలో చెక్కిన తీరు అందరినీ అబ్బురపరుస్తుంది. గర్భగుడి వెనకాల పైభాగంలో గొడ్డలి పిడి ఉంటుంది. ఈ గొడ్డలిని ఆగస్త్యేశ్వర మహాముని విసిరినట్లు చెబుతారు.

పూర్వ కథ

పూర్వం విష్ణువర్ధన్ మహారాజు రాజ్యకాంక్షతో దిగ్విజయ యాత్రకు బయలుదేరి 15 సంవత్సరాల తర్వాత తిరిగి వస్తారు. రాజు యాత్రకు బయలుదేరే నాటికి ఆయన కుమార్తె 3 నెలల పసిబిడ్డ. 15 ఏళ్ల తర్వాత రాజు తిరిగి రాగా ఆమె యుక్త వయస్సులో ఉంటుంది. మహారాజు శయనించే గృహంలో కుమార్తె పట్టెపు పాన్పుపై నిద్రిస్తూ ఉంటుంది. మహారాజు శయన గృహంలోకి ప్రవేశించి చీకటిలో కానరాక తన పట్టపురాణి అని భావించి కుమార్తెపై చేతుల వేయగా ఆమె ఎవరు అని గద్దించడంతో నిజం తెలుసుకున్న మహారాజు అపరాధ భావంతో తల వంచుకొని శయన గృహం వదిలి బయటకు వస్తాడు. తాను చేసిన పొరపాటుకు శిక్ష ఏమిటని మంత్రులు, సామంతులు, పురజనులను కోరతాడు. పర స్త్రీపై చేతులు వేసిన వారికి శిక్షాస్మృతిని అనుసరించి రెండు చేతులను ఖండించాలని తీర్మానించారు. దీంతో తలారులు రాజు రెండు చేతులను ఖండించారు. మహారాజు బాధను భరించలేక ఇక్కడికి చేరుకుని పుట్టను చూసి ఇందులోని పాము కరిచి చనిపోవాలని నిర్ణయించుకుని మొండి చేతులను పుట్టలో పెట్టగా మైకం వచ్చి పడిపోతాడు. కాసేపటికి మెలుకువ వచ్చి చూచుకోగా అతనికి రెండు చేతులు ఉంటాయి. ఆనాటి రాత్రి రాజు ఎదుట పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఆ పుట్టలో ఉన్న వాడిని నేనే, ఆ పవిత్ర స్థలంలో శివాలయం నిర్మించి పూజా కైంకర్యాలు జరపాలని చెప్పి అదృశ్యమయ్యాడు. దీంతో మహారాజు ఆలయాన్ని నిర్మించి శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. పాణీయము అనగా హస్తములు, తన హస్తములను తిరిగి ప్రసాదించడంతో ఇక్కడ ఈశ్వరునికి పాణికేశ్వరుడని పేరు వచ్చింది. ఈ దేవుడి పేరిట గ్రామానికి పాణీయము ఆ తర్వాత క్రమంగా పాణ్యం అని పేరు వచ్చింది.



స్వామి వారి గాలిగోపురం



అభివృద్ధి పనులు ప్రారంభించిన సర్పంచ్ మేకల పల్లవి, అధికారులు

26 నుంచి ఉత్సవాలు

మహాశివరాత్రి పురస్కరించుకొని ఈ నెల 26 నుంచి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 26న తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలతో ప్రారంభించి అదే రోజు జాగరణ, 27న స్వామి వారికి మహాపూజలు జరుగతాయి. 28న ఆలయ ప్రాంగణంలో తెల్లవారుజామున కల్యాణ తంతు నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుంది. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. – ఈఓ సువర్ణ



విష్ణువర్ధన్ మహారాజు నిర్మించిన గర్భగుడి



ఆలయంలో రాయిపై లిఖించిన స్వామివారి చరిత్ర

తిరునాలకు ఏర్పాట్లు

ఏటా మహా శివరాత్రి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో తిరునాల నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. మూడు రోజుల పాటు జరిగే తిరునాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. అంతేకాక ఆలయం గ్రామానికి వెలుపల ఉన్నందున అక్కడి నుంచి ఉత్సవమూర్తులను తిరునాల రోజు ఊరేగిస్తారు. ఈ ఊరేగింపు వైభవంగా జరుగుతుంది.

ఆలయం పేరుతో గ్రామం

ఇక్కడి ఆలయ ప్రసిద్ధి, ఆలయ నిర్మాణం ఎలా చేపట్టారు. ఎందుకు నిర్మించాల్సి వచ్చింది అనే విషయాలను అప్పటి రాజులే రాతి బండపై సంస్కృతంలో లిఖించారు. నేటికీ ఈ రాతలు ఆలయ ప్రాంగణంలో కనిపిస్తాయి. దేవుడి పేరు మీద పాణ్యం గ్రామం వెలసిందంటే ఆలయ ప్రాముఖ్యత, విశిష్టత ఎంత గొప్పదో అర్థమవుతుంది. నేటికీ ఆలయంలో స్వామివారు నిత్యం పూజలందుకుంటున్నారు. ఆలయం ముందు పొలాలు కలిగిన రైతులు స్వామి వారిని దర్శించుకొని వ్యవసాయ పనుల్లోకి వెళ్తారు. స్వామి వారి తిరునాల జరుగుతుందంటే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలివస్తారు.



పాణికేశ్వరస్వామి

బాధ్యతగా పనిచేయాలి

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయ సిబ్బంది విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంపీడీఓ రాముడు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గోరంట్ల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులను పరిశీలించడంతో పాటు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కార్యాలయ వేళల్లో సిబ్బంది కచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ సిటిజన్, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.



గోరంట్ల సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రాముడు

ఎస్‌డబ్ల్యూఎంసీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



బురాన్‌దొడ్డి ఎస్‌డబ్ల్యూఎంసీని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి పంచాయతీ కార్యదర్శులతో అన్నారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని బురాన్‌దొడి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సేంద్రియ ఎరువుల తయారీలో భాగంగా గ్రామ సర్పంచ్ రామాంజనేయులు చేపట్టిన ఎరువులో వానపాముల విడుదలను ఆయన పరిశీలించారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ.. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గాను 12 గ్రామ పంచాయతీలలో చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయని, పూర్తైన కేంద్రాలకు గ్రామాలలోని చెత్తను తరలించి, వర్మీ కాంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

కోడుమూరు రూరల్: గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన ఎంపీడీఓ శివనాగప్రసాద్ శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తక్కువ సంఖ్యలో ప్రజాప్రతినిధులు హాజరవ్వడంతో సమావేశంలో మండలంలో నెలకొన్న సమస్యలపై పెద్దగా చర్చ జరగలేదు. దీంతో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలు ప్రజల దరి చేరేలా చూడాలన్నారు. ఎంపీపీ సునీత మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కొన్ని గ్రామాల్లో పశువులకు కూడా తాగునీరు దొరకదని, ఇందుకోసం ప్రత్యేకంగా నీటి తొట్లను ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్ రామాంజనేయులు, ఎంఈఓ సునీలమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఎలక్ట్రికల్ ఏఈలు సన, నాగరాజు, శ్రీనివాసనాయక్ తదితర అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

వైభవంగా చౌడేశ్వరీ దేవి తిరుగు రథోత్సవం



కోడుమూరులో చౌడేశ్వరీదేవి తిరుగు రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన చౌడేశ్వరీ దేవి తిరునాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారి తిరుగు రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూజారులు మేళతాళాల మధ్య తీసుకొచ్చి రథంపై ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుగు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

లొద్దిపల్లెలో పారిశుద్ధ్య పనులు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామంలోని కాల్వల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి, కాల్వల వెంబడి ఉన్న చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు వెంట ఉన్నారు.

ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

కల్లూరు: ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్)లకు ఓటు హక్కు కల్పించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదనరెడ్డి, సేవలాల్ నాయక్, రఫీ కోరారు. ఈ మేరకు శుక్రవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎన్నో చట్టాలను మార్పు చేస్తోందని, ఎమ్మెల్సీ ఓటు హక్కు విషయంలో సవరణలు చేయకపోవడం విచారకరమన్నారు.

కొత్తూరుకు రూ.20.96 లక్షల ఆదాయం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో టెంకాయలు, పూలు, ఫొటోలు, గాజుల దుకాణం నిర్వహించుకునేందుకు ఏడాది పాటు హక్కులు కలిస్తూ అధికారులు ఈ బహిరంగ వేలం పాట నిర్వహించారు. రుద్రవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం టెంకాయల విక్రయ హక్కులకు రూ.15.50 లక్షలకు, పూల దుకాణం నందివర్గం గ్రామానికి చెందిన సుధీర్‌కుమార్ రూ.4.77 లక్షలకు హెచ్చు పాడారు. అలాగే గాజులు, ఫొటోల దుకాణాలను కొత్తూరు గ్రామానికి చెందిన సుధీశ్వర్‌రెడ్డి రూ.69,500 కు హెచ్చు పాడి దక్కించుకున్నట్లు తెలిపారు. గతంలో పోల్చితే ఈ ఏడాది స్వామి వారికి రూ.1.37 లక్షల ఆదాయం పెరిగినట్లు తెలిపారు. ఈఓ నరసయ్య, మిలటరీ సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, సుబ్బారెడి, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: జాతీయ అంధత్వ నివారణ సంస్థ, జిల్లా అంధత్వ నివారణ సంస్థల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 36వ వార్డు పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ ఎం.సంధ్యారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాలలో 46 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. అతిథులు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో 1,26,412 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 3,700 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ ఉచితంగా కంటి అద్దాలు అందించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ రేణుక, ప్రిన్సిపాల్ ఈరన్న రావు, నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ మధు నరసింహం తదితరులు పాల్గొన్నారు.

- అలాగే దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా పెద్దపాడులోని బాలసదనంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.
- **కర్నూలు(రూరల్):** దిన్నెదేవరపాడు గ్రామంలోని వివిధ సంస్థల్లో చదువుతున్న 821 మంది విద్యార్థులకు గతంలో కంటి పరీక్షలు చేయగా వారిలో 93 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించామని వైద్యాధికారులు తెలిపారు. వారికి ప్రస్తుతం ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తున్నామన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న 14 మంది విద్యార్థులకు శుక్రవారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. హెచ్ఎం మహమ్మద్ యాసిన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు మహేశ్వరరెడ్డి, పరమేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఐ ఏజీఎం అభిషేక్, అధికారులు

కల్లూరు: ప్రజలందరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఐ ఏజీఎం అభిషేక్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు సూచించారు. శుక్రవారం తడకనపల్లె గ్రామంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, మేనేజర్ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో గ్రామస్థాయిలో బ్యాంకింగ్ సేవలు, పర్యవేక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ ఏజీఎం మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కేవైసీ, పిన్ నంబర్లు, ఓటీపీ లాంటి వివరాలను ఇతరులకు చెప్పరాదన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే బడ్జెట్‌పై, ఆర్థిక ప్రణాళికపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంకులు అందిస్తున్న బీమా గురించి పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు జగదీష్, రమేష్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ హనుమయ్య, సర్పంచ్ సహేరాబీ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న నిర్వాహకులు



కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా క్రీడాపోటీలు

- కబడ్డీ విజేత గోనెగండ్ల జట్టు
- క్రికెట్ విజేత ఎమ్మిగనూరు జట్టు
- విజేతలకు బహుమతుల ప్రదానం

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన శ్రీచౌడేశ్వరీ దేవి తిరునాల పురస్కరించుకుని క్రీడల సాంస్కృతిక కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన క్రీడాపోటీలు హోరాహోరీగా సాగాయి. శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించగా మహిళలు పోటీ పడి ముగ్గులు వేశారు. విజేతలకు దాతల సహకారంతో మొదటి, రెండవ, మూడవ బహుమతులతో పాటు, కన్సోలేషన్ బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

- హోరాహోరీగా సాగిన కబడ్డీ పోటీల్లో గోనెగండ్ల జట్టు విజేతగా నిలువగా, రెండవ స్థానంలో వర్కూరు, మూడవ స్థానంలో కోడుమూరు జట్లు నిలిచాయి. విజేతలకు దాతల సహకారంతో నిర్వాహకులు రూ.20,016, రూ.10,016, రూ.5,016 నగదు బహుమతులను అందజేశారు.
- ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్ఆర్‌టీ మైదానంలో గత 2 వారాలుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఎమ్మిగనూరు జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 30 జట్లు తలపడగా ఫైనల్‌కు కోడుమూరు స్టార్ బాయ్స్, ఎమ్మిగనూరు మహీంద్రా లెవెన్ జట్లు చేరుకున్నాయి. శుక్రవారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎమ్మిగనూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 150 పరుగులు సాధించగా, కోడుమూరు జట్టు పది ఓవర్లలో 110 పరుగులు చేసి ఓటమి పాలయ్యింది. విజేతగా నిలిచిన ఎమ్మిగనూరు జట్టుకు రూ.50 వేలు, రెండవ స్థానంలో నిలిచిన కోడుమూరు స్టార్ బాయ్స్ జట్టుకు రూ.25 వేల నగదును కోడుమూరు క్రికెట్ తాలుకా అధ్యక్షుడు డాక్టర్ రఘురామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్గనైజర్ దస్తగిరి, కోచ్ మహబూబ్ అందజేశారు. క్రీడాకారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



క్రికెట్ విజేత ఎమ్మిగనూరు జట్టుకు కప్పు అందజేస్తున్న నిర్వాహకులు